ఇంకా.. నీటి కనెక్షన్ లేదు

యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానలో నీటి సౌకర్యం లేక వైద్యాధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నీటి కనెక్షన్ లేకపోవడంతో వైద్యాధికారులు, సిబ్బంది, రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

- జూబ్లీహిల్స్

పౌష్టికాహారంపై అవగాహన

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులకు పౌష్టికాహార విలువలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అత్యధిక పోషకాలు కలిగిన మొక్కజొన్న పొత్తులు, వివిధ రకాల ఉత్పత్తులు, వాటి లాభాల గురించి వివరించారు. జంక్‌ఫుడ్ తీసుకోకుండా చిన్నారుల కోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

- బంజారాహిల్స్

భారీ మ్యూజిక్‌తో న్యూసెన్స్
- జెనా పబ్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 22: మోతాదుకు మించి భారీ శబ్దంతో మ్యూజిక్ ప్లే చేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న పబ్ నిర్వాహకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 38లోని జెనా పబ్‌లో విపరీతమైన శబ్దాలతో డీజే పెట్టారని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని సోమవారం రాత్రి స్థానికుల ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మోతాదుకు మించి శబ్దం వస్తున్నట్టు గుర్తించిన పోలీసులు జెనా పబ్ నిర్వాహకులు కౌశిక్‌పై బీఎన్ఎస్ 223, 292తో పాటు సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోషకాహార లోపం లేకుండా చూసుకోవాలి

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఆయుష్ మెడికల్ కాలేజ్ హెచ్ఓడీ డాక్టర్ సునీత జోషి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 22 : గర్భిణులు పోషకాహార లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. ఆకుకూరలు, చేపలు, మాంసం, మొలకెత్తిన పప్పు దినుసులు, నిమ్మరసంతో పాటు విటమిన్ సీ ఎక్కువగా ఉండే పండ్లు తీసుకోవాలని ప్రభుత్వ ఆయుష్ మెడికల్ కాలేజీ హెచ్ఓడీ డాక్టర్ సునీత జోషి పేర్కొన్నారు. ధన్వంతరి జయంతి – 9 వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించు కుని మంగళవారం శ్రీరాంనగర్ యూపీహెచ్‌సీలో గర్భణులకు అవగాహన కల్పించారు. నెలలు నిండే వరకు ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. పోషకాహారం తీసుకోకుండా ఉండడం కంటే హాని తలపెట్టే ఆహారం తీసుకోవడంతో హైరిస్క్‌లో పడిపోతారని ఎస్‌పీహెచ్ఓ డాక్టర్ విజయనిర్మల అన్నారు. విటమిన్ ట్యాబ్లెట్లు విధిగా తీసుకోవాలని.. అయితే ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు, క్యాల్షియం మాత్రలను కలిపి తీసుకోకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్య సిబ్బంది గర్భిణులు ప్రతిరోజూ చేయాల్సిన యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు.

గ్రేటర్ ఇమేజ్‌ను దెబ్బ తీసేందుకు చేసే కుట్రలను అడ్డుకోవాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 22 : ఐటీ రంగంలో అభివృద్ధివైపు అడుగులు వేస్తున్న క్రమంలో మతోన్మాద శక్తులు గ్రేటర్ ఇమేజ్‌ను దెబ్బ తీసేందుకు చేసే కుట్రలను అడ్డుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటీ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న నగరంలో మతోన్మాద శక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గొడవలు సృష్టిస్తున్నాయన్నారు. ఇలాంటి శక్తులపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, నిఘా వ్యవస్థ అప్రమత్తంగా ఉండి ఘటనలు జరుగక ముందే చర్యలు తీసుకోవాలన్నారు. మా వేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, నాయకులు బి.వెంకటేశం, ఎన్.శ్రీకాంత్, ఒమర్‌ఖాన్, నళిని, శంకర్ నాయక్, చంద్రమోహన్‌గౌడ్, శ్రీనివాస్, మహమూద్, కె.బాబు, లక్ష్మీ బాయి, బి.కిషన్, పి.వెంకటయ్య, బాలకృష్ణ, నర్సింగ్‌రావు, గ్యార నరేశ్, మాజీద్, ఇమ్రాన్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరసింహ

సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి

మఖ్దుం భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్,అక్టోబర్ 22 : సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని, దళితులకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హైదరాబాద్‌లో 2025 జనవరి 5 నుంచి 7 వరకు జరిగే అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి 2వ జాతీమ మహాసభల సహ్నాహక సమావేశాన్ని మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై దాడులు పరంపర కొనసాగుతున్నాయని విమర్శించారు. దళితుల సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.బాల నరసింహ, నాయకులు యేసు రత్నం, పి.పర్వతాలు, అనిల్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, రత్నకుమారి, సహదేవ్, రాజ్‌కుమార్, జె.కుమార్, రాజరత్నం, టి.రామకృష్ణ, లక్ష్మీపతి, ఉషశ్రీ, దేవి పోచన్న పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాక..

విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ, అక్టోబర్ 22 : మూసీలో ఇండ్లు కోల్పోతున్న బాధితులను పరామర్శించేందుకు బుధవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రానున్నట్లు మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భీమార్జున్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కార్యదర్శి కొమురయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, బుక్క వేణుగోపాల్, బీజేఎంసీ అధ్యక్షుడు మ హేశ్ యాదవ్, నాయకులు మహాలింగంగౌడ్, లక్ష్మీ నారాయణ, కాడెం సుధాకర్, ప్రశాంత్, నరేశ్ పాల్గొన్నారు.

లేడీ డాక్టర్‌పై.. వాహనదారుడి దాడి
బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

వెంగళరావునగర్, అక్టోబర్ 22 : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న లేడీ డాక్టర్‌పై ముఖానికి ముసుగు ధరించిన వాహనదారుడు దాడికి పాల్పడ్డ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీలోని చర్చి గల్లీలో మహిళా వైద్యురాలు నడుచుకుంటూ వెళ్లసాగింది. వెనకాల నుంచి బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన యువకుడు దుర్భాషలాడుతూ.. ఆమె వీపుపై బలంగా కొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీవోఏలకు కనీస వేతనాలివ్వాలి

సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 22 : సెర్ప్ డిపార్ట్‌మెంట్‌లో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి కనీసవేతనం రూ.26 వేలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం ప్రగతి భవన్‌లో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌కు ఏఐటీయూసీ ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. డ్వాక్రా గ్రూప్‌లతో మహిళలు పొదుపు, ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి పొందేందుకు వీవోఏలు పనిచేస్తున్నారని తెలిపారు. 18 ఏండ్లుగా పనిచేస్తున్న వీరికి నెలకు రూ.6 వేలు ఇవ్వడంతో ఇబ్బందిగా మారిందన్నారు. అర్హులైన వీవోఏలకు పదోన్నతులు కల్పించి, పెన్షన్, గ్రాడ్యూటీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. సెర్ప్ సీఈవో సానుకూలంగా స్పందించి వీవోఏల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీవోఏ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్.సీతా మహాలక్ష్మి, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్, లత, పద్మ, రమణ పాల్గొన్నారు.

సైబర్ టెక్నాలజీ కోర్సులకు డిమాండ్

పార్క్ హయత్‌లో మాట్లాడుతున్న యూనివర్సిటీ ఆఫ్ లండన్ డీన్ సారా మెక్రోలా

బంజారాహిల్స్,అక్టోబర్ 22 : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌లో సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సంబంధిత కోర్సులకు రానున్న రోజుల్లో డిమాండ్ పెరుగనున్నదని బీపీపీ యూనివర్సిటీ ఆఫ్ లండన్ డీన్ సారా మెక్రోలా అన్నారు. ప్రతిష్టాత్మక బీపీపీ యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో సరికొత్త ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సును మంగళవారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చర్చావేదికలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న కోర్సులు, బీపీపీ యూనివర్సిటీ, సావరియా ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఇంటర్నేషనల్ కెరీర్ గ్యారెంటీ ప్రోగ్రాం వివరాలను చర్చించారు. ప్రతియేటా హైదరాబాద్ నుంచి తమ యూనివర్సిటీలో 2వేల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరుతున్నారన్నారు. ఎమ్మెస్సీలో డేటా సెక్యూరిటీ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సులకు భారీ డిమాండ్ ఉందన్నారు. 30వేల పౌండ్స్‌తో ఈ కోర్సులలో చేరవచ్చనన్నారు. కార్యక్రమంలో సావరియా ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి రాజేశ్ గోయల్, మోహిత్ గబ్బర్, కపిల్, ప్రదీప్, జగదీశ్ లాథూర్ పాల్గొన్నారు.

సింగాడకుంటలో కార్పొరేటర్ పర్యటన

జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్, అక్టోబర్ 22 : వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి మంగళవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. సింగాడకుంటలోని బోరింగ్ గల్లీ నుంచి చోటూబాయ్ గల్లీ దాకా సీవరేజీ లైన్, సీసీ రోడ్డు పనులు చేయాల్సి ఉందని కార్పొరేటర్ తెలిపారు. పనుల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు ఇచ్చామని, అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ప్రారంభం

శివనగర్ కాలనీలో నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ నరేందర్

మణికొండ, అక్టోబర్ 22 : ప్రజా అవసరాలను తెలుసుకొని అభివృద్ధి పనులను చేపడుతున్నామని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ వెల్లడించారు. 18వ వార్డులోని పుప్పాగూడ శివనగర్ కాలనీలో రూ.42 లక్షలతో చేపట్టనున్న నూతన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పురుషోత్తం, లక్ష్మీనారాయణ, యాదయ్య, కాంగ్రెస్ కార్యనిర్వహక అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్, శివనగర్ కాలనీ సంఘం సభ్యులు, గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వం పూర్వవిద్యార్థుల సమ్మేళనం

మణికొండ, అక్టోబర్ 22 : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. సిల్వర్ జూబ్లీని కోకాపేట్‌లోని శుభం బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించి చదువు నేర్పిన గురువులకు పాదాభివందనం అంటూ వారిని సన్మానించారు. సమ్మేళనంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రవీందర్, భూపాల్, నాగార్జున పాల్గొన్నారు.

మరోసారి దర్యాప్తు చేపట్టండి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయశ్రీ

బండ్లగూడ, అక్టోబర్ 22: హత్య కేసును మరోసారి దర్యాప్తు చేపట్టి సూత్రధారులను అరెస్ట్ చేయాలంటూ ఓ తల్లి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. బండ్లగూడ జాగీర్ పరిధిలోని ఇంద్రమ్మకాలనీలో డి.జయశ్రీ తన కొడుకు సాయివర్షిత్‌తో కలిసి ఉంటున్నది. రెండు నెలల కిందట జరిగిన తాపీమేస్త్రీ హత్య కేసులో సాయివర్షిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. తల్లి జయశ్రీ జైల్లో కుమారుడిని కలిసి.. ఏం జరిగిందని ఆరాతీయగా.. అసలు విషయం తెలిపాడు. దాంతో ఆమె రాజేంద్రనగర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించింది. తన కొడుకు నిందితుడు అయినప్పటికీ వేరేవాళ్లు ఉన్నట్లు పేర్కొంది. కాళికా నగర్‌కు చెందిన తాపీమేస్త్రీ రేణు బాబును ఆగస్టు 1న బండరాళ్లతో మోది హత్య చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, సాయివర్షిత్‌ను నిందుతుడిగా పేర్కొంటూ అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనంతరం తన తల్లి బంధువులతో కలిసి సాయివర్షిత్‌ను జైల్లో కలిసి ఆరా తీయడంతో తనకు ఏ పాపం తెలియదని తన స్నేహితులైన కృష్ణ, చరణ్ (విశాల్), సందీప్, సోను డబ్బులు ఆశచూపి తానే ఈ హత్య చేసినట్లు ఒప్పుకోవాలని బెదిరించినట్లు వాపోయాడని తెలిపింది. అనేక అనుమానాలున్నాయని మరోసారి సరైన దర్యాప్తు చేపట్టాలని సీపీతో పాటు రాజేంద్రనగర్ డీసీపీని కలిసి ఆమె విజ్ఞప్తి చేసింది.

ఆస్తిపన్ను వసూలుపై అధికారుల దృష్టి

ఇప్పటి వరకు వసూలైంది రూ.17 కోట్లు..

డిసెంబర్ నుంచి ఆస్తిపన్నుపై 2 శాతం వడ్డీ..

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం

జూబ్లీహిల్స్, అక్టోబర్ 22 : నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో కీలకపాత్ర పోషించే ఆస్తిపన్ను వసూలుపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించారు. 100 శాతం ఆస్తిపన్ను వసూలుతో సర్కిల్ పరిధిలోని వార్డులను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో జీహెచ్ఎంసీ అధికారులు పన్ను వసూలును వేగవంతం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆస్తిపన్ను మొదటి అర్ధభాగంపై 2 శాతం వడ్డీ వేస్తున్న అధికారులు.. డిసెంబర్ నుంచి రెండో అర్ధభాగంపై కూడా వడ్డీ జమచేస్తూ మొత్తం ఆస్తిపన్నుపై ప్రతినెలా 2 శాతం వడ్డీ వేయనున్నారు. కమర్షియల్, గృహ యజమానులకు అవగాహన కల్పిస్తూ దీర్ఘకాలంగా చెల్లించకుండా ఉన్న మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. అధికారులు ఇప్పటి వరకు రూ.17 కోట్లపైనే ఆస్తిపన్ను వసూలు చేశారు. గతేడాది రూ.33.73 కోట్ల లక్ష్యానికి 100 శాతం వసూలు చేసిన అధికారులు ఈ ఏడాది కూడా లక్ష్యాలను చేరేందుకు కృషి చేస్తున్నారు. ఇ యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల 9 డాకెట్‌లను ఏర్పాటుచేశారు. ఆయా డాకెట్‌ల పరిధిలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌లు కమల్, బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు వసూలు వేగవంతం చేస్తున్నారు.

సకాలంలో చెల్లించి.. అభివృద్ధికి బాటలు వేయాలి
- జకియా సుల్తానా, డీసీ, యూసుఫ్‌గూడ.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి బాటలు వేయాలి. అదనపు పెనాల్టీ భారం పడకుండా ప్రాపర్టీ ట్యాక్స్‌ను చెల్లించాలి. ఈ మేరకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నాం. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారికి నోటీసులు ఇస్తున్నాం. ఆస్తిపన్ను వసూలు లక్ష్యాన్ని చేరేందుకు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెకర్లు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ఈవీఎంలతో ఎన్నికల్లో పారదర్శకత ఉండదు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

ఖైరతాబాద్, అక్టోబర్ 22: ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, అందులో పారదర్శకత ఉండదని కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా దేశాలు ఈవీఎంల నిర్వహణను విరమించుకున్నారని, ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో ఇంకా ఈ వ్యవస్థ కొనసాగుతున్నదన్నారు. తెలంగాణలోని 17 ఎంపీ నియోజకవర్గాలలో ట్యాంపరింగ్ జరిగినట్లు అనుమానం ఉన్నదన్నారు. హర్యానాలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఓవర్ కాన్ఫిడెన్స్ కారణమని, ట్యాంపరింగ్ జరిగినట్లు అనుమానం ఉన్నదన్నారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ సభకు లక్షలాది మంది వస్తే, బీజేపీ సభలకు వేల మంది మాత్రమే వచ్చారన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉన్న చోట్ల ట్యాంపరింగ్ చేయడం లేదని, బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లోనే జరుగుతుందన్నారు. బీజేపీకి మతం తప్ప నిరుద్యోగ నిర్మూలన, ధరలు తగ్గించాలన్న అభిమతం లేదన్నారు. ఏపీలో టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతుందన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో బాబు ఇచ్చిన స్టేట్‌మెంట్ హాస్యాస్పందంగా ఉన్నదన్నారు. అందులో అలాంటి కల్తీ ఏమి జరుగలేదన్నారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన అంశంపై నిపుణుల సలహాలు తీసుకొని, వారి ఆలోచనలు పరిగణలోకి తీసుకోవాలన్నారు.

ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మహేందర్

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 22 : మైలార్‌దేవ్‌పల్లి కురుమ పొదుపు సంఘం, కుమారస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అడికే కుమారస్వామి 27వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రస్ట్ చైర్మన్ అడికే మహేందర్ హాజరై కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమారస్వామి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శీలం లక్ష్మణ్, అడికే సురేశ్, ప్రవీణ్‌కుమార్, శీలం శ్రీరాములు, గోవర్ధన్, సంతోష్, శ్రావణ్, కళావతి, లావణ్య పాల్గొన్నారు.



కాటేదాన్‌లోని ఆటోస్టాండ్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకుడు రాజు

బీజేపీ సభ్యత్వ నమోదు..

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 22 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తుందని రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు అడికే రాజు అన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ చౌరస్తాలోని ఆటోస్టాండ్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, అడికే శివశంకర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 22 : బీజేపీ సభ్యత్వాన్ని విస్తారించాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి కార్యకర్తలకు సూచించారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని మల్కారంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైం నాయకులు సిద్ధు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌ముదిరాజ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో మల్లారెడ్డి